


భగవాన్

**అదొక** చిన్న పల్లెటూరు.

చిన్న పల్లెటూరైనా, ఒక చిన్న హైస్కూలు ఉంది ఆ వూరికి.

ఆ స్కూల్లో విద్యార్థినీ విద్యార్థుల సంఖ్య రెండు వందలు. హెడ్మాస్టరుతో కలిపి టీచర్ల సంఖ్య అయిదు—ఒక ప్యూన్.

టీచర్లు అయిదుగురిలో నేనూ ఒకణ్ణి.

చదివింది బి. ఇడి., అయినా సెకండరీ గ్రేడు పోస్టులో కొత్తగా అపాయింట్ అయ్యాను.

గుమాస్తా కూడా లేకపోవడంతో ఆఫీసు వర్కు కూడా మా నెత్తిమీదే పడేది. అసలే టీచర్లు బాగా తక్కువవడం వల్ల పనిభారం ఎక్కువేమో—మళ్ళీ ఆఫీసు వర్కొకటి, మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు. వాకుమాత్రం అన్నప్రాశన రోజునే ఆవకాయ అన్నం పెట్టినట్టుండేది.

ఆ స్కూల్లో పనిచేయడమంటే, నరకంలో బాధ అనుభవించినట్టే! ఉదయం పది గంటల నుండీ సాయంత్రం నాలుగున్నర వరకూ ఏడు పీరియడ్లూ లీజర్ లేకుండా విద్యార్థులతో వాగేటప్పటికి మా కుప్పకీ ఉడిగిపోయి, గుండె గొంతులోకి వచ్చేది. ఆ తర్వాత ఆఫీసు వర్కు ... ఒక్కోరోజు రాత్రి ఇంటికి వెళ్ళేటప్పటికి పదో, పదకొండో అయేది.

"ఇంత ఆలస్య మయిందే? ... ఇంతవరకూ స్కూల్లోనే ఉన్నారా? రాత్రి పదింటి వరకూ పని చేయించుకుంటున్నాడు, మీ హెడ్మాస్టరుకి పెళ్ళాం, పిల్లలు లేరా?: ..." నా శ్రీమతి వేసే ప్రశ్నలకు తిక్కరేగి, ఆ కోసం ఈ కోసం ఇంట్లో పిల్లల మీద చూపెట్టేవాడ్ని. స్కూలే అనుకుంటే, ఇల్లు కూడా నరకంలా తయారయేది.

టీచర్లు తక్కువవడం వల్ల హిందీ మాస్టరు సోషల్ కూడా చెప్పవలసి వచ్చేది. తెలుగు టీచర్ ఇంగ్లీషు కూడా బోధించవలసి వచ్చేది. ఫిజికల్ సైన్సు టీచర్ బయాలాజికల్ సైన్సు చెప్పవలసి వచ్చేది.

టీచర్స్ నలుగురమూ వయసులో ఉన్నవాళ్ళం కనుక పని భారాన్ని చిరునవ్వుతో స్వీకరించేవాళ్ళం. రేపో, మాపో రిటైర్ అయిపోనున్న హెడ్మాస్టరు గారు కూడా మా కన్నా హుషారుగా పనిచేసేవారు ...

ఆ స్కూల్లో పిల్లల గురించి చెప్పవలసి వస్తే, వాళ్ళు చాలా మంచివాళ్ళు. అసలు గొడవ చేసేవారు కారు. మా బాధను అర్థం చేసుకునేవారేమో మరి, మేం చెప్పే పాఠాలు ప్రశాంతంగా వినేవారు.

ఆ రోజు ...

మధ్యాహ్నం ఒంటి గంటకు లీజర్ టైమైనా ఎవ్వరం ఇంటికి వెళ్ళకుండా ఆఫీసు వర్కు చేస్తూ స్టాఫ్ రూమ్‌లోనే కూర్చుండిపోయాం.

ప్రకాశరావు మాస్టారు జీతాలబిళ్ళు తయారు చేస్తున్నారు. నేను అటెండెన్సు రిజిస్టరులో పేర్లు వ్రాస్తున్నాను. తెలుగు, హిందీ టీచర్లు కూడా ఏదో ఆఫీసు పని చూస్తున్నారు. హెడ్మాస్టరు గారు డి. ఇ. ఓ. గారి దగ్గర్నుంచి వచ్చిన కాగితాలు చూస్తున్నారు.

ప్యూన్ కొండయ్య అందరికీ టీలు తెచ్చి ఇచ్చాడు. మే మందరం టీ సేవిస్తూ ఆఫీసు పనిలో నిమగ్నులమై పోయాం.

ఇంటికి వెళ్ళిన విద్యార్థులు తిరిగి స్కూలుకు వచ్చే వేళ అయింది.

ఆ సమయంలో రంగారావు స్టాఫ్ రూమ్‌లోకి చాలా కోపంగా వచ్చాడు. పిడుగులా వచ్చాడు. మండిపడుతూ వచ్చాడు.

రంగారావంటే ఆ వూరు బ్రాంచి పోస్టాఫీస్‌కు మాస్టరు. వృత్తికి పోస్టుమాస్టరైనా, ఆవూరి పెద్దమనుషులలో ఒక పెద్ద మనిషి ... ముక్కోపి!

నేను కొత్తగా వచ్చిన వాడి నవడం వల్ల రంగారావు పేరు వినడమే కాని, అతన్ని ఇంతవరకూ చూడనేలేదు. అతనే కాదు, అసలా వూర్లో చాలా మంది తెలియదు నాకు.

నాకు తెలిసినవాళ్ళు పంచాయితీ సర్పంచ్ దశరథరామయ్య గారు మాత్రమే.

స్కూల్లో చార్జి తీసుకున్న రోజున ఆయన్ని కలిశాను.

నమస్కారం చేశాను.

దాని కాయన ప్రతినమస్కారం చేసి "చూడండి, మాస్టారూ! మీ

రెప్పుడూ నాకు నమస్కరించవద్దు మీరు పవిత్రమైన బాధ్యతాయుతమైన వృత్తిలో ఉన్నారు. మాలాంటి వాళ్ళచేత మీరు నమస్కారా లందుకోవాలి. అంతేకాని, మీరు నమస్కారం చేసి, గౌరవమైన మీ వృత్తికి కళంకం తీసుకు రావద్దు. మీ బాధ్యతలను మీరు విస్మరించవద్దు... మీకు ఎప్పుడు ఏ సహాయం కావలసి వచ్చినా, నే మన్నా నని మాత్రం మరిచిపోకండి'' అన్నారు.

ఆ మాటలకు ఆయన ఎలాంటి వ్యక్తో, ఆయన వ్యక్తిత్వం ఎటువంటిదో నాకు అర్థమైపోయింది.

మా మాస్టర్లందరూ అంటారు—దశరథరామయ్య గారు చాలా మంచి వారనీ, ఆయన పేరుకి తగ్గ మనిషి అనీ, ఆయన తన పదేళ్ళ పదవీ కాలంలో వూరికి కావలసిన వసుపాయాలన్నీ చేసి గ్రామ ప్రజలందరి చేతా ఘనంగా కొనియాడబడుతున్నారనీ.

స్టాఫ్‌రూమ్‌లోకి వచ్చిన రంగారావు నాకేసి ఉరిమి చూస్తూ "ఏమయ్యా, కొత్త మాస్టరూ, ఏమిటి మా వాడ్నేదో అన్నావంట?'' అన్నాడు.

నాకు గుండెలో పిడుగు పడినట్టు అయింది.

రంగారావు ముక్కోపి అనే సంగతి బాగా తెలుసు ప్రకాశరావు మాస్టారుకి. అందుకే ఆయన రాగానే "రండి, రంగారావుగారూ, రండి!! ఇలా కూర్చోండి'' అంటూ కుర్చీ చూపించారు.

"నే నిక్కడ కూర్చుందుకు రాలేదయ్యా! ఈ కొత్త మాస్టరి యవ్వారమేంటో తేల్చుకుందామని వచ్చాను!'' అరిచినట్లుగా అన్నాడు.

ఆయ నలా అనేసరికి, మా మాస్టర్లందరి చూపులూ నాకేసి తిరిగాయ్.

నేను బిగుసుకు పోయినట్లుగా కూర్చుండిపోయాను—'నేనేం చేశాన్రా, భగవంతుడా!' అని మనసులో అను కుంటూ.

"ఏం జరిగిందండి?'' హెడ్మాస్టరు గారు అడిగారు.

"ఏం జరగడ మేమిటండీ! అసలు నే నెవర్ని? ఈ వూర్లో ఒక పెద్ద మనిషిని ... అవునా?... ఆ సంగతి మరిచిపోయి నా కొడుకుని తిడతాడా ఈ కొత్త పంతులు!'' రెచ్చిపోయాడు రంగారావు.

"అసలు ముందు మీరు కూర్చోండి తరవాత మాట్లాడుకుందాం!'' ప్రకాశరావుగారు అన్నారు.

"నేను కూర్చోనండి. ఈ సంగతేదో తేలాల్సిందే!'' అరిచాడు రంగారావు.

ఆ అరుపుకు స్టాఫ్‌రూమ్ అదిరిపోయింది.

స్టాఫ్‌రూమ్‌లోంచి అరుపులు వినిపించే సరికి విద్యార్థులు తొంగిచూడడం ప్రారంభించారు.

"నా కొడుకుని క్లాసురూము లోంచి గెంటేస్తానంటాడా! ప్యూన్‌గాడి చేత గెంటిస్తానంటాడా? అలగా జనం చేత గెంటించుకునే కర్మేం పట్టిందండి నా కొడుక్కి!'' రంగారావు ముఖంలో కోపం ప్రజ్వరిల్లింది...

"ప్లీజ్ కొంచెం మెల్లగా మాట్లాడండి. స్టూడెంట్సు చూస్తున్నారు.'' అనునయంగా అన్నారు హెడ్మాస్టరు గారు.

"మెల్లగా మాట్లాడ్డేండి. ఈ సంగతి తేలేవరకూ నే నూరుకోను.'' కోపంతో వూగిపోతున్నాడు మనిషి.

నాకు భయంతో, ఆందోళనతో ఒళ్ళంతా చెమటతో చెరువులా తయారైంది.

"పని ఎక్కువగా ఉండడం వల్ల విసుగొచ్చి అన్నారేమో...'' నన్ను సమర్థించబోయారు హిందీ మాస్టరు.

"పని చెయ్యడం అంత కష్టంగా ఉంటే రాజీనామా ఇచ్చేసి పోవాలి. అంతేకాని...''

రంగారావు మాటల్ని కట్‌చేస్తూ హిందీ మాస్టరు "అది కాదండీ! ఎవడికి నేను హిందీ మాస్టర్నే. కాని సోషల్ చెప్పవలసి వస్తోంది. ఈయన తెలుగు మాస్టరైనా ఇంగ్లీషు చెప్ప వలసి వస్తోంది. మాస్టర్లు తక్కువగా ఉండడంవల్ల పనిఎక్కువగా ఉంటుంది—తప్పదు! పొద్దుట్నుంచీ వాగుతూండడం వల్ల విసుగొచ్చి పిల్లల్ని ఏదో అంటాం! అంతేకాని పిల్లల మీద మాకే విధమైన కక్షా కసీ ఉండదండీ!... మీ కుర్రాడేదో చెప్పాడని మీ రిక్కడకొచ్చి దెబ్బలాడ్డం బాగాలేదు'' అన్నారు కొంచెం గట్టిగానే.

"ఎందుకు బాగాలేదు ... మా పిల్లల్ని మీ రెన్నయినా అనొచ్చుగాని, మిమ్మల్ని మే మేం అనకూడ దన్న మాట ... మీకు పాఠాలు చెప్పడం విసుగ్గా ఉంటే మానెయ్యండి ...''

"మానెయ్యమంటే మానేస్తాం ... కాని, నష్టం మీ పిల్లలకేనని గుర్తుంచుకోండి ...''

"అదంతా నా కనవసరం. చేసిన తప్పుకి ఈ కొత్త పంతులు క్షమాపణ చెప్పాల్సిందే...'' రంగారావు బల్ల గుద్ది గట్టిగా అన్నాడు.

క్షమాపణ అనేసరికి నాకు కాస్త బాధ కలిగింది.

"నేను పిల్లవాణ్ణి కోప్పడ్డాను. అది నేరం కాదు. నేను క్షమాపణ చెప్ప వలసిన పని లేదు.'' ఎలాగో గొంతు పెగుల్చుకుని అన్నాను.

దానితో వీరభద్రుడి అవతారం ఎత్తాడు రంగారావు.

"నా సంగతి నీ కింకా తెలియదల్లే ఉంది. నా క్కోపం వచ్చిందంటే నర మామిడి చెట్టుకి వ్రేలాడదీస్తాను... ఎవ డడ్డొస్తాడో చూస్తాను'' అంటూ కుర్చీ బలంగా తన్నాడు. కుర్చీ గింగిరాలు తిరుగుతూ పోయి గోడకు బలంగా గుద్దుకుని ఆగిపోయింది.

ఆ చర్య హెడ్మాస్టర్ గారికి తీవ్రమైన కోపం తెప్పించింది. కాని, అనుభవమున్న వ్యక్తి కావడం వల్ల అంతలోనే తమాయించుకుని, "పోన్లెండి, ఆయన తరపున నేను క్షమాపణలు చెబుతున్నాను—క్షమించండి'' అన్నారు.

"మీరు చెబితే కుదరదండి ... ఆ కొత్త పంతులు చెప్పవలసిందే ... అదైనా నాకు కాదు—మా అబ్బాయికి చెప్పాలి'' అన్నాడు రంగారావు కళ్ళ లోంచి నిప్పులు కురిపిస్తూ.

రంగారావు అన్న ఆ మాట వినేసరికి అంతవరకూ ప్రశాంతంగా ఉన్న ప్రకాశ రావుగారికి ఒళ్ళు మండిపోయింది.

"ఇది చాలా అన్యాయమండీ, రంగా రావుగారూ! మీ అబ్బాయికి క్షమాపణ చెబితే ఈ స్కూల్లో మే మింక పని చేయగలమా? స్టూడెంట్సు మా మాట వింటారా? పిల్లలకు మేం గోచీలు పెట్ట వలసి వస్తుందండి ... మాట్లాడామంటే అర్థముండాలి ... మీ ఇష్ట మొచ్చినట్టు మాట్లాడితే ఇక్కడ పడే వాళ్ళెవ్వరూ లేరని గుర్తుంచుకోండి. మీ రేమన్నా మమ్మల్ని పోషిస్తున్నారా? అసలు మీరు స్టాఫ్ రూమ్‌లోకి ఎవరి అనుమతి తీసుకుని వచ్చారు? మీ అంతట మీరు స్టాఫ్ రూమ్‌లోకి ప్రవేశించే అధికారం మీ కెవ రిచ్చారు? చదువుల దేవాలయంలోకి వచ్చి, సాటి టీచర్లముందు, స్టూడెంట్సు ముందు ఒక టీచర్ని చంపుతానని బెదరిస్తారా? ఒక ఉద్యోగస్తుడిని పట్టుకొని అలగా జనమని చులకన చేస్తారా? మీ రెంత పెద్ద మనుషులైతే మా కేమండి? మర్యాద, మన్నన తెలియని మనిషి మీరు. ఒక టీచర్ని చంపుతానని బెదరించినందుకు, ఒక ఉద్యోగస్తుణ్ణి అవహేళన చేసినందుకు ముందు మీరు వాళ్ళకు క్షమాపణలు చెప్పండి ...'' ఆవేశంతో వూగిపోతూ అన్నారు ప్రకాశ




'ప్రతి రోజూ కావాల్సిన తాజాదనం, స్ఫూర్తి'

**అందరూ ఎరిగిన గుర్తించిన శక్తినిచ్చే, ఫలితానిచ్చే ఒకాసా**

ఉరుకులూ, పరుగులతో నేటి ఆందోళన జీవితంలో, మీరు పోగొట్టుకునే శక్తిని... ఒకాసావల్ల తిరిగి పొందగలుగుతారు మీరు.

ఒకాసా ప్రతి బిళ్ళలోనూ, శక్తివంతమైన 6 రసాయనిక పదార్థాలూ, 6 ఖనిజాలూ, 10 విటమిన్లూ, అపరూపమైన మూలికల సారమూ ఉంది, శక్తినిచ్చే మరే యితర టానిక్ అయినా దీనికి సాటిరాదిక. ఔషధయుక్తంగా ప్రభావితమైన, ప్రపంచ ప్రసిద్ధమైన ఒకాసా, మిమ్మల్ని శక్తితో, ఉత్సాహంతో నింపుతుంది, ప్రతిరోజూ, అదీ ప్రత్యేకమైన తీరులో, ప్రతిరోజూ.

**20 రోజులకు పనికొచ్చే వీలైన కొత్త ప్యాక్‌లో**


పేరెన్నికగన్న మందుల దుకాణాలన్నిటిలోనూ దొరుకుతుంది.

**ఒకాసా**

ఒకాసాని గూర్చిన ఉచితపు పుస్తకం కోసం వ్రాయండి.

OKASA CO. PVT. LTD. Post Box No. 396, Bombay-400 001.

573



రావు గారు.

ప్రకాశరావుగారు ఎదురు తిరిగేసరికి, రంగారావు కోపం తారాస్థాయి నందుకుంది. అవమానభారంతో, పట్టరాని కోపంతో ముఖం ఎర్రబారింది. పూనకం వచ్చిన వాడిలా వూగిపోసాగాడు.

"నోర్మూయ్ ... నన్ను క్షమాపణ చెప్పమంటావురా! ... నే నెవర్ననుకున్నావురా? నాకు వందెకరాలు పంట భూమి ఉందిరా! ... నువ్వు సంపాదించే జీతం ఆరు వందలు నా చుట్టల ఖర్చుకి సరిపోదురా? ఎంత ధైర్యం! నన్ను పట్టుకుని క్షమాపణ చెప్పమనేంత గొప్పవాడివైపోయావా? చూస్తాను. నన్నెదిరించి ఈ వూర్లో మీ రెలా మనగలరో చూస్తాను" అంటూ చిందులు తొక్కుతూ కోపంగా బయటకు వెళ్ళిపోయాడు రంగారావు.

ఆ తర్వాత అరగంట వరకూ మేము తేరుకోలేకపోయాం. సాయంత్రం దశరథ రామయ్య గారిని కలుసుకుని జరిగినదంతా విన్నవించుకున్నాం.

"దీనిమీద మీ రేదైనా చర్య తీసుకొనకపోతే మే మింక ఈ స్కూల్లో పని చేయలేము, సార్! ఇప్పు డూరుకుంటే, రేపు ఇంకొకడు కూడా ఇలాగే ప్రవర్తిస్తారు... మీరు ఈ విషయంలో మాకు న్యాయం చేకూర్చాలి. లేకపోతే, ట్రాన్స్‌ఫర్స్ పెట్టుకొని వెళ్ళిపోతాం" అన్నారు హెడ్మాష్టరు బాధతో.

"కంగారు పడకండి మాష్టారూ! మీకు తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తాను. దీని గురించి మీరు పెద్దగా వర్రీ పెట్టుకుని పాఠాలు చెప్పడం మానెయ్యకండి. ఈ రాత్రే రంగారావుని పిలిపించి అడుగుతాను." అభయమిచ్చారు దశరథరామయ్యగారు.

మేము అన్యమనస్కంగానే ఇంటి దారి పట్టాము.

ఆ రాత్రి ఏం గొడవ జరిగిందో ఏమో మరి, మర్నాడు ఉదయం ప్రార్థన అవుతూండగా దశరథరామయ్య గారు రంగారావుని వెంటబెట్టుకుని వచ్చారు,

ప్రార్థన పూర్తయి, పిల్లలు క్లాసు లోనికి వెళ్ళిపోయిన తర్వాత స్టాఫ్ రూమ్‌లో అందరూ సమావేశమయ్యాం.

"రంగారావ్! నువ్వు చెప్పవలసినదేదో తొందరగా చెప్పేస్తే మంచిది. లేకపోతే అనవసరంగా క్లాసులు పాడైపోతాయి" అన్నారు దశరథరామయ్యగారు.

"అది కాదు..." అని ఏదో నసగబోయాడు రంగారావు.

"ఇప్పుడేం చెప్పను! నువ్వు చేసింది తప్పు — స్కూల్లో అనుమతి లేకుండా ప్రవేశించి, మాష్టర్లని తిట్టడమనేది. చాలా పెద్ద తప్పు. నువ్విలా ప్రవర్తించడం వల్ల, పిల్లల దృష్టిలో మాష్టర్లంటే లోకువభావం ఏర్పడుతుంది నీ వల్ల ఇప్పు డీ మాష్టర్లు పాఠాలు సరిగా చెప్పకపోతే రెండు వందల మంది పిల్లలు నాశనమై పోతారు ఈ పిల్లలెవరు? మాష్టర్ల పిల్లలా? మనపిల్లలా? మన పిల్లలేగా? నీ పిల్లలు ఈ స్కూల్లో ఎంతమంది చదువుతున్నారు. నీ తెలివి తక్కువతనం వల్ల, నీ మూర్ఖత్వం వల్ల నీ పిల్లల భవిష్యత్తుకు నువ్వే గోతులు తవ్వుకుంటున్న వాడి వవుతున్నావ్? పిల్లల దృష్టిలో మాష్టర్ల లోకువ కాకుండా ఉండాలంటే నువ్వు చేసిన తప్పుకు క్షమాపణ చెప్పవలసిందే" అన్నారు దశరథరామయ్యగారు ప్రశాంతంగా.

"నేను లేనివ వేళ మంచిది కాదు. పొరపాటుగా ఏదో మాట్లాడాను దయచేసి అందరూ నన్ను క్షమించండి" ఈ సబసబా అనేసి, మండుతున్న గుండెతో స్పీడుగా బయటకు వెళ్ళిపోయాడు రంగారావు

రెండు నిమిషాలైన తర్వాత —

"చూడండి! రంగారావు క్షమాపణ చెప్పడం వల్ల మీ బాధ్యత రెట్టింపయిందని గుర్తుంచుకోండి. రంగారావే కాదు, ఈవూర్లో ఇంకెవరూ మీ జోలికి రారు. ఇదివరకటి కన్నా మీరు కష్టించి పనిచేసి పిల్లల భవిష్యత్తుని తీర్చి దిద్దండి." చల్లగా చెప్పేసట్టు చెప్పి, నవ్వుతూనే హెచ్చరించి వెళ్ళిపోయారు దశరథరామయ్యగారు.

మేము వృత్తిధర్మమంటే ప్రాణమిచ్చే వాళ్ళం కాబట్టి మా కా మాటలు సంతోషాన్ని కలగచేశాయే కాని, కించిత్ బాధను కూడా కలగచేయలేదు మా పరువు నిలబెట్టి నందుకు మే మాయనకు మనసులోనే నమస్కరించాము.

దేశంలోని సర్పంచ్‌లందరూ దశరథ రామయ్యగారిలాగే సహృదయంతో టీచర్లందరినీ ట్రీట్ చేస్తే విద్యార్థులందరూ చక్కని భావి భారత పౌరులుగా తయారవుతా రనడంలో సందేహం లేద

'దేశ మే గతి బాగుపడునోయ్?' అని ఎవరైనా అడిగితే, ఈ సంఘటనచెప్పి, 'దేశమీగతి బాగుపడునోయ్!' అని సమాధాన మిస్తాను.

మొన్నటి సంవత్సరం మళ్ళీ పంచాయతీ ఎన్నికలొచ్చాయి. ఆ వూరి పంచాయతీ ఎన్నికల చరిత్రలో జరిగిన అత్యాశ్చర్యకరమైన, ఆందోళనకరమైన సంఘటన ఏమిటంటే — "గ్రామాభ్యుదయం కోసం అవిరళ కృషి జరిపిన దశరథరామయ్యగారు ఓడిపోవడం, మూర్ఖుడూ, దుర్మార్గుడూ అయిన రంగారావు పట్టుదల పట్టి ఆ పదవిలోకి రావడం!

రంగారావుని ఎన్నుకోవడం ఆ గ్రామ ప్రజల మూర్ఖత్వ మహాలో, దశరథరామయ్యగారి సేవను దూరం చేసుకోవడం వారి అవివేకమహాలో నా కర్థం కాలేదు.

ఇక ఆ వూరికీ, ఆ వూరి స్కూల్లో టీచర్లమైన మాకూ ఆ దేవుడే దిక్కు...'

ఇప్పు డెవరైనా 'దేశ మేగతి బాగు పడునోయ్?' అని అడిగితే, 'దేశ మీగతి పడుపడునోయ్!' అని సమాధానం చెపుతాను. *